నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | సోమవారం 22 ఏప్రిల్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY




మాట్లాడుతున్న దాస్యం, చిత్రంలో బండా, బస్వరాజు, సుధీర్‌కుమార్

# వరంగల్ ప్రజలు బీఆర్ఎస్ వైపే

## కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధం

**బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్**

- కడియం వెళ్లడంతో బీఆర్ఎస్‌కు మొదటి స్థానం
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- అవకాశవాద రాజకీయాన్ని ప్రజలు గమనిస్తున్నారు
- ధర్మానికే ప్రజల ఓటు : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



హనుమకొండ, ఏప్రిల్ 21 : ఉమ్మడి వరంగల్ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని.. ఈ ప్రాంత ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పేందుకు వారు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వడంలో బీజేపీ విఫలమైందన్న దాస్యం, ప్రస్తుత పరిస్థితులు బీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయని, వరంగల్ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగరడం ఖాయం అని చెప్పారు.

### బీఆర్ఎస్ ప్రొడక్టును కొనుగోలు చేసిన కాంగ్రెస్, బీజేపీలు

**ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**

బీఆర్ఎస్ పార్టీ ప్రొడక్టును కాంగ్రెస్, బీజేపీలు కొనుగోలు చేశాయి. ప్రజలు ఎప్పుడూ కూడా ధర్మానికే ఓటు వేసి అధర్మాన్ని ఓడిస్తారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ధర్మమే గెలుస్తుంది. వరంగల్ పార్లమెంట్ బరిలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిన వారే. అవకాశవాద రాజకీయాలను వరంగల్ ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వారికి గుణపాఠం చెబుతారు.

### బీజేపీ, కాంగ్రెస్‌తో ఒరిగేదేమీ లేదు..

**బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్**

తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తే.. బీజేపీ ధోకా చేసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య, బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గం చుట్టూ ఉన్న భూములను ఆక్రమించిన అరూరి రమేశ్ ఓ భూకబ్జాదారుడు. రేపు ఎంపీగా గెలిపిస్తే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం చుట్టూ ఉన్న భూములు కూడా ఆక్రమిస్తాడు. ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషిచేసిన భారత రాష్ట్ర సమితి పార్టీకి ఓటు వేసి గెలిపించాలి. బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదు. పేదల నడ్డివిరుస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నది. మోదీ భారత దేశానికి ప్రధానా, గుజరాత్ రాష్ట్రానికా అనే అనుమానం ప్రజల్లో ఉన్నది. తెలంగాణకు ఒక్క వైద్య కళాశాల కూడా మంజూరు చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ విష ప్రచారం చేస్తున్నది. మరమ్మతులు చేయకుండా రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో విడుదల చేసిన నోటిఫికేషన్లకు ఉత్తర్వులు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పడం విడ్డూరంగా ఉంది. సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, సుందర్‌రాజు యాదవ్, మర్రి యాదవరెడ్డి, రైతు కో ఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు జోరిక రమేశ్, బి.వీరేందర్, చింతల యాదగిరి, రవీందర్‌రావు, పరశురాములు, మైనార్టీ నాయకుడు నయీముద్దీన్, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

### నేడు బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ నామినేషన్

బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ సోమవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 10గంటలకు బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా వరంగల్ కలెక్టరేట్ వరకు వెళ్లి ఉదయం 11గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు. బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దాస్యం పిలుపునిచ్చారు.

### రేపు వరంగల్‌కు కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 23న వరంగల్‌కు రానున్నారు. మంగళవారం సాయంత్రం వరంగల్‌లోని నాని గార్డెన్‌లో జరిగే వరంగల్ తూర్పు, హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్‌లో జరిగే వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాలకు కేటీఆర్ హాజరవుతారని దాస్యం తెలిపారు.

### ప్రజలను వంచించడం కాంగ్రెస్ పార్టీ నైజం

**శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్**

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీ మొదటి స్థానానికి వచ్చి, కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయంతోనే ఉద్యమం పుట్టుకొచ్చింది. త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఏ ఒక్కరోజూ జై తెలంగాణ అనలేదు. ఆనాడు ఆరు సూత్రాలు అని ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆరు హామీల పేరుతో మరో కుట్రకు తెరతీసింది. 610 జీవోతో ప్రారంభమైన ఉద్యమాల ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. గొడవలు పెంచడం, ప్రజలను వంచించడం కాంగ్రెస్ పార్టీ నైజం. విభజన చట్టంలోని హామీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. తెలంగాణ ప్రజలను మోసం చేసే వారిని గుణపాఠం తప్పదు.



రాయపర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

# అబద్ధాల కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి

**కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా**
**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**
**పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం**

వర్ధన్నపేట/రాయపర్తి, ఏప్రిల్ 21 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వర్ధన్నపేట మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీ కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుతూ కాంగ్రెస్‌కు ఓట్లు వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ప్రజాసంక్షేమ కార్యక్రమాన్ని కూడా అమలు చేయలేకపోతోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో భూములకు విలువ పెరిగిందన్నారు. కాంగ్రెస్ వచ్చాక భూముల రేట్లు పూర్తిగా పడిపోయాయన్నారు. పరిపాలనలో పూర్తిగా వైఫల్యం చెందుతున్న కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. తిరిగి కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారని వివరించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే ఈ నెల 22న సోమవారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మారెపల్లి సుధీర్‌కుమార్ నామినేషన్ వేయనున్నందున పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ గోపాల్‌రావు పాల్గొన్నారు. అలాగే, రాయపర్తి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి కూడా ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై మాట్లాడారు. అబద్ధాల కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, ఎంపీపీ అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, జిల్లా నాయకుడు సుధీర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

# నేడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ పురస్కారం

**ఢిల్లీలో అందించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**



ఢిల్లీలో గడ్డం సమ్మయ్య కుటుంబ సభ్యులు

దేవరుప్పుల, ఏప్రిల్ 21: మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు కేంద్ర ప్రభుత్వం సోమవారం న్యూఢిల్లీలో పద్మశ్రీ పురస్కారం అందించనుంది. ఈ మేరకు సమ్మయ్యకు కేంద్రం నుంచి ఆహ్వానం అందడంతో ఆదివారం ఆయనతోపాటు సతీమణి గడ్డం శ్రీరంజని, కుమారులు సోమరాజ్, హిమగిరి, మురళీకృష్ణ ఢిల్లీకి వెళ్లారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు అందించనున్నారు. ఢిల్లీకి చేరిన సమ్మయ్య కుటుంబానికి హోటల్ అశోకాలో విడిది ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీతో పాటు అనేక మంది ప్రముఖులు అవార్డుల ప్రదానోత్సవానికి అతిథులుగా హాజరుకానున్నారు.

# కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి

**రంగులు మార్చే ఊసరవెల్లి 'కడియం'**
**సుధీర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి**
**నామినేషన్‌కు శ్రేణులు భారీగా తరలిరావాలి**
**జనగామ ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య**



జనగామలోని మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేదికపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

జనగామ, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా రాజకీయాల్లో రంగులు మార్చే కడియం శ్రీహరికి బుద్ధి చెప్పాలంటే కాంగ్రెస్ అభ్యర్థి కావ్యను చిత్తుగా ఓడించాలన్నారు. ఆదివారం జనగామలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటికొండ రాజయ్యతో కలిసి పల్లా హాజరై మాట్లాడారు. కడియం శ్రీహరికి దమ్ముంటే ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా, ఎంపీగా, డిప్యూటీ సీఎంగా అనేక పదవులు అనుభవించిన ఆయన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మోసం చేసి కాంగ్రెస్ పంచన చేరారని విమర్శించారు. సోమవారం వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నందున స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు హాజరుకావాలని పల్లా పిలుపునిచ్చారు.

**మోసం చేయడంలో కడియం తర్వాతే ఎవరైనా : రాజయ్య**

నమ్ముకున్న వారిని మోసం చేయడంలో కడియం శ్రీహరిని మించిన వారు మరొకరు లేరని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మండిపడ్డారు. కేసీఆర్ దయతో ఎన్నో పదవులు అనుభవించి, కారు గుర్తుపై పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరి ఆయననే వెన్నుపోటు పొడిచాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో దళిత ద్రోహి కడియం శ్రీహరి కూతురిని ఓడగొట్టాలనే కసితో ప్రజలు ఉన్నారన్నారు. నాలుగు నెలల క్రితం కారు గుర్తుతో గ్రామాల్లోకి వచ్చిన ద్రోహి ఇప్పుడు మరో పార్టీ గుర్తుతో గ్రామాల్లోకి వస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎడవెల్లి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# మాయమాటలు నమ్మొద్దు



కేసముద్రంలో మాట్లాడుతున్న ఎంపీ మాలోత్ కవిత, చిత్రంలో మాజీ మంత్రి సత్యవతి

**కాంగ్రెస్ పాలనలో ఆగమవుతున్న రైతులు**
**రుణమాఫీపై ఏ ఆగస్టు నెలలో చేస్తారో సీఎం స్పష్టంగా చెప్పాలి**
**వరికి రూ.500 బోనస్ ఏమైంది?**
**బలరాంనాయక్ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదు**
**సన్నాహక సమావేశంలో ఎంపీ మాలోత్ కవిత**
**మానుకోటకు నిధులివ్వని సీఎం : మాజీ మంత్రి సత్యవతిరాథోడ్**

కేసముద్రం, ఏప్రిల్ 21 : మోసకారి కాంగ్రెస్ పార్టీని రైతులు నమ్మొద్దని, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలో వచ్చిన తర్వాత దాటవేత ధోరణితో రైతులను గోస పెడుతున్నదని మహబూబాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. ఆదివారం కేసముద్రం మండల కేంద్రంలో జరిగిన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో మండువేసవిలోనూ చెరువులు మత్తడి పోశాయని, కాంగ్రెస్ పాలనలో చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయన్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఆగస్టు 15న వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఏ సంవత్సరం ఆగస్టు నెలలో చేస్తారో స్పష్టంగా ప్రకటించాలని కోరారు. గతేడాది వానకాలంలో సాగు చేసిన వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి వచ్చే ఏడాది ఇస్తామంటున్నారని, రైతులు గమనించాలన్నారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి ద్వారా రూ.లక్షా 116 అందిస్తే, రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటికీ అమలుచేయడం లేదన్నారు. ఓటు వేసే ముందు తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలుపుతామని చెప్పిన బలరాంనాయక్ మాటలను గుర్తుచేసుకోవాలన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బలరాంనాయక్ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ లు రెండు జాతీయ పార్టీలని, వాటితో తెలంగాణ హక్కులను సాధించలేమన్నారు. మీ ఇంటి ఆడబిడ్డగా తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ నెల 23న తన నామినేషన్ కార్యక్రమానికి అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

**ఎవరేం చేశారో గుర్తించాలి : సత్యవతిరాథోడ్**

ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారి మానుకోటకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధికి నిధులు ఇవ్వని విషయాన్ని ఈ ప్రాంత ప్రజలు గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. కేసీఆర్ సీఎంగా మొదటిసారి మానుకోటకు వచ్చినప్పుడు హార్టికల్చర్ యూనివర్సిటీ, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాల నిర్మిస్తామని హామీ ఇచ్చి, నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇటీవల మానుకోటలో జరిగిన సీఎం సభకు జనం రాకపోవడంతో రెండు గంటల పాటు సీఎం రేవంత్‌రెడ్డి బస్సులోనే ఉండిపోయారని అన్నారు. కమీషన్ల కోసమే మెడికల్ కళాశాల నిర్మిస్తున్నారని చెబుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్ గర్భిణులకు ఆపరేషన్లు చేసి ఎంత డబ్బు గుంజుతున్నాడో మీ అందరికీ తెలుసునన్నారు.

**ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదు : శంకర్‌నాయక్**

మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ పనితీరును, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనితీరును ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల్లో ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు, ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకుడు భరత్‌కుమార్‌రెడ్డి, ఊకంటి యాకూబ్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి, జాటోత్ హరీశ్‌నాయక్, మోడెం రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, సట్ల వెంకన్న, అన్నెపాక వెంకన్న, నర్సయ్య, రామ్మూర్తి, ఆగె వెంకన్న, ఘనపారపు రమేశ్, లింగాల పిచ్చయ్య, గుంజపాడుగు కొమ్మన్న, కూన భద్రాద్రి పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం

**మానుకోట, జనగామ జిల్లాల్లో జోరువాన**
**విరిగిన చెట్లు, కూలిన కరెంట్ స్తంభాలు**
**పలుచోట్ల పిడుగులు, నిలిచిన విద్యుత్ సరఫరా**



బయ్యారం మండలం సత్యనారాయణపురంలో కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

మహబూబాబాద్ రూరల్/బయ్యారం/దేవరుప్పుల/పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 21 : మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి కిందపడ్డాయి. మహబూబాబాద్ మండలం బేతోలు గ్రామంలోని బీసీ కాలనీలోఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బలంగా వీచిన గాలికి పలు గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరగడంతో కరెంట్ సరఫరాను నిలిపివేశారు. బయ్యారంలో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురవగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదే మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. ఏజెన్సీ ప్రాంతంలో వరి, మక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. ఇటుక బట్టీల్లో ఇటుకలు తడిసిపోయాయి. జనగామ జిల్లా దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్లు కూలిపడగా మామిడికాయలు రాలిపోయాయి. ఐకేపీ సెంటర్లలో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కామారెడ్డిగూడెంలో పిడుగు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



మహబూబాబాద్ జిల్లా బేతోలు గ్రామంలో కూలిపోయిన విద్యుత్ స్తంభం



బేతోలు గ్రామంలో రహదారిపై విరిగి పడిన చెట్టు